అంతర పంటతో అధిక లాభాలు


దోసను కోస్తున్న కూలీలు


ఎగుమతికి సిద్ధం చేస్తున్న దోస

పీసీపల్లి: అంతర పంటల సాగుతో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఓ పంట దెబ్బతిన్నా మరో పంట దిగుబడులు ఇస్తుండటంతో రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. వ్యవసాయాధికారులు కూడా అంతర పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో అధికారుల సూచన మేరకు రైతులు అంతర పంటగా దోస సాగు చేశారు. నియోజకవర్గంలో సుమారు 200 ఎకరాల్లో అంతర పంటగా దోస సాగు చేశారు. ప్రస్తుతం రైతుల వద్ద కేజీ రూ.10లకు కొనుగోలు చేస్తున్నారు.

కందిలో అంతరపంటగా దోస

మండలంలో ప్రధానంగా కందిలో అంతర పంటగా దోసను సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని పీసీపల్లి, బుద్దారెడ్డిపల్లి, మురుగమ్మి, వరిమడుగు, మారెళ్ల గ్రామాల్లో అధిక శాతం మంది రైతులు కందిలో అంతర పంటగా దోసను సాగు చేశారు. ఒక్క పీసీపల్లిలోనే 50 ఎకరాల్లో దోస పంటను సాగు చేశారు.

ఎకరాకు రూ.10వేలు ఖర్చు.......

దోస సాగుకు ఎకరాకు రైతుకు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం 60 కేజీల టిక్కీ రూ.600 వరకు పలుకుతుంది. దోసను అంతర పంటగా సాగు చేయడం వల్ల రైతులకు ఖర్చు తగ్గింది. దిగుబడి కూడా బాగా వస్తుండటంతో ఎకరాకు రెండింతల లాభం వస్తుంది. దీంతో ఎక్కువ మంది రైతులు అంతర పంటగా దోస సాగు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కూలీల సమస్య కూడా ఉంది. కూలీలు సరైన సమయానికి రాకపోవడంతో కాయలు కుళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కూలీ ఖర్చులు అన్నీ పోను రైతులకు మంచి ధర అందుతుంది. అయితే దళారులు పంటల వద్దే తక్కువ ధరను కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంట కోసిన తరువాత మార్కెట్‌కు తీసుకెళ్లాలంటే రవాణా చార్జీలు ఎక్కువగా ఉండటంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని దళారులు కొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరకే అడుగుతున్నారు. కొన్ని గ్రామాల్లో మంచి ధరలు వచ్చినా దూరం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో దళారులు తక్కువ ధర చెల్లిస్తున్నారు.

అంతరపంటతో అధిక ఆదాయం



దోస పంటను ప్రధాన పంటగా కాకుండా అంతరపంటగా వేయడంతో పెట్టుబడులతో పాటు ఆదాయం పొందాం. కొన్ని ప్రాంతాల్లో కాయలు కుళ్లిపోవడంతో కొంత మంది రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కూలీల సమస్యను అధిగమిస్తే రెండింతలు లాభం వస్తుంది. కూలీలు సకాలంలో రాకపోతే కాయలు కుళ్లిపోయి రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి.

– మాలకొండారెడ్డి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

కందిలో అంతర పంటగా దోస సాగు చేస్తున్నారు. ధర బాగుండటంతో రైతులు ఎక్కువ మంది అంతర పంటగా దోస సాగుకు ముందుకు వస్తున్నారు. మేంకూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతర పంటల్లో తెగుళ్లు సోకకుండా రైతులకు నిత్యం అప్రమత్తం చేస్తున్నాం.

– కుసుమ, ఉద్యానశాఖాధికారి

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


చెన్నపునాయునిపల్లెలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ వెంకటరమణ

సీఎస్‌పురం(పామూరు): అధిక వర్షాల నేపథ్యంలో రైతులు పంటల సాగులో జాగ్రత్తలు వహించాలని ఏడీఏ ఎ.వెంకటరమణ అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లి, రేగులచలక గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వరిపంటను పరిశీలించిన ఏడీఏ పలు సూచనలు చేశారు. వరిని ఆశించే అగ్గితెగులు, ఆకుముడత, కాండం తొలుచు పురుగు యాజమాన్య పద్ధతులు, రైతులు వాడాల్సిన ఎరువులపై వివరించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, ఎంపీఈఓ యం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని ముప్పళ్లపాడు, దాసళ్లపల్లి, రామాయిపల్లి, విరగారెడ్డిపల్లి గ్రామాల్లో తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను ఏఓ కె.రమణ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా వర్షానికి మొలకెత్తిన సజ్జ కంకుల మండెను, మినుము, అలసంద, పంటలను పరిశీలించారు. కంకులకు వచ్చిన మొలకను పరిశీలించారు. కంకుల మండెను ఎండకు, గాలికి ఆరబెట్టాలన్నారు. పంటలకు సోకిన తెగుళ్లకు వాడాల్సిన మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచలిచ్చారు. వీఏఏ, శరద, రైతులు వెంకటరెడ్డి, తదిరతులున్నారు.

పీసీపల్లి: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి షారుక్ అన్నారు. మండల పరిధిలోని పెదవరి మడుగు రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఏరు తెగులుపై అవగాహన ఉండాలని, తెగులు సోకిన మొక్కను పీకి తగులబెట్టాలన్నారు. అనంతరం పంటలను పరిశీలించారు. మనోహర్, అఖిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి భరత్‌చంద్ర

కనిగిరి రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి కె.భరత్‌చంద్ర శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్‌రూం, ఎండీఎం ఆహారం, క్లాస్ రూమ్స్, తాగునీరు, టాయిలెట్స్ తదితర వాటిని పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇస్తున్న బియ్యం కాకుండా సన్న బియ్యం ఏర్పాటు చేయాలని విద్యార్థులు తెలుపగా, తగు చర్యలు తీసుకోవాలని, ఎండీఎంలోకి నాణ్యమైన సన్నబియ్యం ఏర్పాటు చేయాలని జడ్జి సూచించారు. పాఠశాలలో ఎలాంటి సమస్య ఉన్నా మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆయన తెలిపారు. విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం రికార్డ్‌లను పరిశీలించారు. హెచ్‌ఎం కలువ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పరశు సత్యగోపాల్, దిల్షాద్‌బేగం, సీహెచ్‌కేవీ గౌతమి, గంగవరపు కళావతి, టి. రమణారెడ్డి, డీవీ రంగారెడ్డి, ఫిజికల్ డైరక్టర్ పాశం సుశీల పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక దాడులు


మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి హైమావతి

కనిగిరి రూరల్: జిల్లా విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ అధికారులు బృందాలుగా ఏర్పడి దాడులు చేశారు. తనిఖీల్లో సుమారు 25 విద్యుత్ అధికారుల బృందాలు పాల్గొన్నాయి. అనంతరం జిల్లా విజిలెన్స్ అధికారి టి.హైమావతి మాట్లాడుతూ అనధికార విద్యుత్ చౌర్యం కేసుకు రూ.6వేలు, 45 అదనపు లోడు కేసులకు రూ.1.92 లక్షల జరిమానా విధించామన్నారు. కనిగిరి డివిజన్ ఈఈ ఏ వీరయ్య, ఏడీఈఆర్ ఉమాకాంత్, పామూరు ఏడీఈ వి.కృష్ణారెడ్డి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని విద్యుత్ జిల్లా విజిలెన్స్ అధికారి హైమావతి అన్నారు. జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారి హైమావతి ఆధ్వర్యంలో మండలంలో విద్యుత్ అధికారులు 25 బృందాలుగా ఏర్పడి 1286 సర్వీసులను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా 93 కేసులు నమోదు చేసి రూ.3,11,600 జరిమానా విధించారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సబ్ డివిజన్ అధికారులు యుగంధర్, రాఘవేంద్రరావు, కొండపి ఏఈ కుంచాల కోటయ్య పాల్గొన్నారు.

బింగినపల్లికి నిధుల కేటాయింపులో పక్షపాతం

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులు బింగినపల్లి గ్రామాభివృద్ధికి కేటాయించకపోవటంపై వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలానికి రూ.3.07 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరవ్వగా మిగిలిన అన్ని గ్రామాలకు నిధులు కేటాయించి ఒక్క బింగినపల్లికే ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల్లో బింగినపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ రావటమే కారణమా అని ప్రభుత్వ పనితీరును విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ప్రజలకు అభివృద్ధి పథకాల లబ్ధిని చేకూర్చామని, సుమారు రూ.3 కోట్లకు పైగా సిమెంట్ రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించామని, సుమారు రూ.90 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకె, హెల్త్ సెంటర్ నిర్మించామని వివరించారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం బింగినపల్లి గ్రామంపై వివక్ష చూపుతుందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు.

దంచికొట్టింది..!


వేములపాడు వద్ద పొంగి పారుతున్న ఏనుగ మందవాగు


సింగరాయకొండ బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన నీరు


టంగుటూరులో వర్షం పడుతున్న దృశ్యం


పైరెడ్డిపాలెం, పెరికపాలెం మధ్య వాగుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

హనుమంతునిపాడు: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. హనుమంతునిపాడు, వేములపాడు, ఉమ్మనపల్లి, వాలిచర్ల, తిమ్మారెడ్డిపల్లి, మొరవారిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో కుంభవృష్టి వర్షం కురిసింది. దీంతో పొలాల్లో నీరు నిలిచిపోయింది. వేములపాడు వద్ద ఏనుగుమంద వాగు, మొరవారిపల్లి, హనుమంతునిపాడు మధ్యలో ఉన్న ఎర్రవాగులు పొంగి పొర్లుతున్నాయి. వర్షంతో కుంటలు, చెక్‌డ్యాంలలోకి నీరు చేరింది. కంభం–కనిగిరి రహదారిలో మోకాలి లోతు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి.

సింగరాయకొండ: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురవగా మధ్యలో రెండు రోజులు తెరిపించి శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగుల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. మండలంలో 86.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

టంగుటూరు: మండలంలో శనివారం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి గంట పాటు వర్షం కురిసింది. దీంతో రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి సెంటర్ వరకు వర్షం నీరు నిలిచి గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జయవరం ఎన్‌టీఆర్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్నా పోతుల చెంచయ్య కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. మండలంలో 29.9 మి.మీ వర్షపాతం నమోదైంది.

పొన్నలూరు: మండలంలో శనివారం ఓమోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్ర వరకు అడపాదడపా వర్షం పడుతూనే ఉంది. దీంతో పలు గ్రామాల్లోని రోడ్లు జలమయం కావడంతో పాటు పంట పొలాలు, వాగులు, కుంటల్లోకి వర్షం నీరు చేరాయి. ఎగువ ప్రాంతంలో వర్షం పడటంతో పొన్నలూరు చెరువుకు చెరువుకు జాలుగా వర్షం నీరు చేరుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షం మెట్ట పైర్లకు, పొగాకు నారుమళ్లకు బాగా ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో పాటు తేలికగా గాలులు రావడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొండపి: మండలంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ పి.మురళి తెలిపారు. శనివారం కురిసిన వర్షానికి పొలాల్లో కొంతమేర నీరు నిలిచింది.

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాల్లో సరాసరిన 6.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కనిగిరి మండలంలో 0.4మి.మీ, వెలిగండ్లలో 11.4, హెచ్‌ఎంపాడులో 1.0, పామూరులో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పీసీపల్లి, సీఎస్‌పురంలో వర్షపాతం నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

చెరువులకు జలకళ


పీబీ ఛానల్ పరిధిలోని రాజు చెరువులో సంవృద్ధిగా చేరిన నీరు

● సాగుకు సమాయత్తమవుతున్న రైతులు


పీబీ ఛానల్‌లో ఉధృతంగా పారుతున్న వర్షంనీరు

సింగరాయకొండ: మండలంలో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. శనివారం కూడా భారీ వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులకు నీరు సంవృద్ధిగా చేరింది. మండలంలో పాలేరు–బిట్రగుంట స్కీమ్ సప్లయ్ ఛానల్ పరిధిలోని చవిటి చెరువు నిండగా, బింగినపల్లి చెరువు 90 శాతం నిండింది. మిగిలిన చెరువులు 50 నుంచి 70 శాతం వరకు నిండాయి. వర్షాధార చెరువులైన కలికవాయ, కనుమళ్ల, శానంపూడి, సోమరాజుపల్లి చెరువులు సుమారు 50 శాతం వరకు నిండాయని ఇరిగేషన్ లస్కర్ రవి తెలిపారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట చెరువు నూరు శాతం నిండి అలుగు పారుతుంది. చెరువుల్లో ఆశాజనకంగా నీరు చేరడంతో వరినార్లు పోసేందుకు రైతులు దుకాణాల వద్దకు బారులుతీరారు. అయితే గత ఏడాది 30 కేజీల బస్తా రూ.1300 ఉండగా ఈ సంవత్సరం రూ.1500 వరకు పలుకుతుందంటున్నారు.

ఫీబీ ఛానల్ అభివృద్ధికి సొంత నిధులు

ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొండపి అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లను ఆయకట్టు రైతులు కలిసి పీబీ ఛానల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఇద్దరు నేతలు తమ సొంత నిధులు సుమారు రూ.7 లక్షలతో సుమారు 25 కిలోమీటర్ల పొడవు ఉన్న ఛానల్‌ను అభివృద్ధి చేసి కాలువలో ఉన్న పిచ్చిచెట్టను తొలగించారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనంతగా ఫీబీ చానల్ ఉధృతంగా పారడంతో బింగినపల్లి చెరువు 90 శాతం నిండింది. గతంలో ఎన్నడూ ఇంత త్వరగా చెరువు నిండలేదని, ఇదంతా వైఎస్సార్‌సీపీ నాయకుల వల్లేనని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా..

రక్తహీనత నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలి

పామూరు: గర్భిణులు, బాలింతలు, పిల్లలు రక్తహీనతను నివారించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని అప్పమాంబాపురం, వగ్గంపల్లె ఎస్టీకాలనీల్లో శుక్రవారం రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని తగ్గించేశక్తి మునగాకుకు ఉందన్నారు. ఈసందర్భంగా మునగాకుతో తయారుచేసిన మునగాకు పొడి, కూర, పకోడి, బూరెలు, చపాతి, చట్నీ, రైస్ మొదలైన వంటకాలను ప్రదర్శించారు. ఏఎన్‌ఎం ప్రత్యూష, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీ


కనిగిరి రూరల్: మున్సిపల్ కార్మికులు విధి నిర్వహణలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసఫ్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో శనివారం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కార్మికులు ఇబ్బందులు పడకుండా రెయిన్ కోట్స్‌ను శనివారం పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్‌రసూల్, హెల్త్ సెక్రటరీ చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దశపర్ణితో లద్దె పురుగు నివారణ


దశపర్ణి కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు

టంగుటూరు: దశపర్ణి కషాయంతో లద్దె పురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కొణిజేడులో దశపర్ణి కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కషాయాన్ని 41 రోజుల తర్వాత వడగట్టి అన్ని రకాల పంటల్లో రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల లద్దె పురుగుతో పాటు తెగుళ్లను కూడా నివారించవచ్చన్నారు. ప్రకృతి సేద్యంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలకు అందించవచ్చన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం గ్రామంలో రైతులకు ప్రకృతి సేద్యం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. మర్లపాడు యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి తుమ్మలపూడి, ఐసీఆర్పీలు సుజాత, మరియమ్మ, త్రివేణి, హరిత, కవిత, జ్యోత్స్న, శృతి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు


ప్రతిపాదిన నిమ్జ్ ప్రాంతంలో ఎమ్మెల్యేతో చర్చిస్తున్న రిటైర్డ్ కల్నల్ జయరావ్

పామూరు: పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, రిటైర్డ్ కల్నల్ జయరావ్ అన్నారు. మండలంలోని మాలకొండాపురం వద్ద ప్రతిపాదిత నిమ్జ్ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలిసి వారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కల్నల్ జయరావ్ మాట్లాడుతూ ప్రతిపాదిత నిమ్జ్ ప్రాంతంలో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు అనువైనదిగా భావించి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. టెక్నాలజీ తీసుకువచ్చి స్కిల్ డెవలప్‌మెంట్ చేయాలంటే ఇండస్ట్రీయల్ ఏర్పాటు అవసరమన్నారు. అనంతరం సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనకు వెళ్లి పూజలు నిర్వహించారు. బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి, సయ్యద్ అమీర్‌బాబు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

కొండపి: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ బి.రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ అంజలీదేవి, ఏఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జునరెడ్డిని పరామర్శించిన దద్దాల


నాగార్జునరెడ్డిని పరామర్శిస్తున్న దద్దాల

కనిగిరి రూరల్: మండలంలోని బుడ్డాయపల్లిలో అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్న పార్టీ కార్యకర్త మద్దిరాల నాగార్జున రెడ్డిని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కటికల వెంకట రత్నం, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, తమ్మినేని ఉమాశంకర్, మిట్టా రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోషకాహార ప్రయోజనాలపై అవగాహన

కనిగిరి రూరల్: పోషకాహారం, వాటికి విలువలు, ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి అన్నారు. స్థానిక ఇందిరా కాలనీ, కాశిరెడ్డి బజార్, ఎన్జీఓ కాలనీ సచివాలయాల పరిధిలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాలు, ప్రయోజనాలను వివరించారు.

8 మంది జూదరుల అరెస్టు

మర్రిపూడి: మండలంలోని చిమట శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 8 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.72,170 నగదు స్వాధీనం చేసుకున్నామని, వారిని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరుస్తామన్నారు. కోడిపందేలు, పేకాట తదితర జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

పామూరు: పామూరులో రూ.2 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న 19 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఎంపీడీఓ బొలినేని సురేష్, పీఎస్ గంగిరెడ్డి అరవింద, బొల్లా నరసింహారావు, మాజీ సర్పంచ్ మనోహర్, పువ్వాడి రామారావు, ఇర్రి కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

టంగుటూరు: టంగుటూరులో జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీడీ వెంకటస్వామి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు విజయలక్ష్మి, సృజన, బీటీటీఏఫ్ చెన్నమ్మ ముగ్గురు ఉద్యోగులు పల్లె పండుగ కార్యక్రమానికి అధికారులంతా వస్తున్నా...11 గంటలకు కూడా కార్యాలయానికి రాలేదు. దీంతో ముగ్గురు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందున క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

కనిగిరి రూరల్: రబీ సీజన్‌కు సంబంధించి శనగ విత్తనాలు సబ్సిడీపై పొందేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పి.జ్యోత్స్నదేవి తెలిపారు. 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు ఇస్తామన్నారు. జేజీ–11 రకం విత్తనాలు సబ్సిడీపై రూ.7,050, కేఏకే–2 రకంవిత్తనాలు సబ్సిడీ పోను రూ.9,075లకు అందజేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవాకేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు.

21 నుంచి రేగులచిలకలో సర్వే

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచిలక రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 224 కు సంబంధించి వారం రోజుల పాటు ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. ఈ నెల 21వ తేదీ సోమవారం నుంచి వారం రోజుల లోగా సర్వే సిబ్బందికి మీ భూమిపై గట్టు చూపించి, భూమికి సంబంధించిన యాజమాన్య పత్రాలు అందజేసి సర్వేకు సహకరించాలని తహసీల్దార్ రైతులకు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్ర అభివృద్ధికి దాతలసాయం

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి దాతలసాయం కొనియాడదగినదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. సీఎస్‌పురం 4వ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన 3 తలుపులు పూర్తిగా శిథిలమైపోగా కేంద్రం కార్యకర్త, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన చెరుకుపల్లి వెంకటరెడ్డి శుక్రవారం రూ.25 వేల సొంత నిధులతో శిథిలమైపోయిన తలుపుల స్థానంలో కొత్త తలుపులు ఏర్పాటుచేయించారు.

టమోటా తరలిస్తున్న మినీ వ్యాన్ బోల్తా


బోల్తాపడిన మినీ వ్యాన్

టంగుటూరు: అదుపు తప్పి టమోటా తరలిస్తున్న మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ సంఘటన జాతీయ రహదారిపై జూనో బేకరీ సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె నుంచి రైతులు టమోటా లోడుతో మినీ వ్యాన్‌లో ఒంగోలు తరలిస్తుండగా టంగుటరు సమీపానికి వచ్చేసరికి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలోని టమాటా మొత్తం చెల్లాచెదురుగా రోడ్డుపై పడింది. వెనుక నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జాతీయ రహదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కపెట్టారు. రైతులు టమోటా సరుకును మరో వాహనంలో ఒంగొలుకు తరలించారు.

తుఫాన్‌కు కూలిన రేకులు ఇల్లు


జువ్విగుంటలో కూలిన రేకులు ఇల్లు

మర్రిపూడి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండంలోని జువ్విగుంట గ్రామంలో రేకుల ఇల్లు కూలిపోయింది. ప్రమాదంలో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుల వివరాల మేరకు.... మండలంలోని జువ్విగుంట పంచాయతీ పరిధిలోని కృష్ణ బలిజ కాలనీకి చెందిన పసుపులేటి బ్రహ్మనందం యోగమ్మలకు చెందిన రేకుల ఇల్లు వర్షాలకు పైకప్పు లేచిపోయాయి. వర్షానికి గోడలు కూడా నాని కూలిపోయాయి. ద్విచక్ర వాహనంపై చిన్న చిన్న వస్తువులు అమ్ముకొని జీవనం సాగించే తమకు రేకులు కూలడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.